క్లుప్తంగా

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

రాయచోటి అర్బన్ : మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా తెలిపారు. మున్సిపల్ సభా భవనంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో పలు అంశాలు, సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. సమావేశాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులతోపాటు అన్నిశాఖల అధికారులు తప్పక సమావేశానికి హాజరుకావాలంటూ ఆయన కోరారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

సిద్దవటం : మాధవరం–1 గ్రామంలోని దక్షిణ కాశీ శివలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా బుధవారం శివపార్వతుల ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించి మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. గ్రామంలోని మహిళలు, పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం వచ్చిన భక్తులకు స్థానికులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



పుల్లంపేటలో జేసీబీ సాయంతో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

పుల్లంపేట : పుల్లంపేట నుంచి చిట్వేలికి వెళ్లే రహదారి ఆక్రమణకు గురి కావడంతో పలుమార్లు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో ఎట్టకేలకు బుధవారం హైకోర్టు ఆదేశాల మేరకు తహసీల్దార్ నరసింహ కుమార్, పోలీస్ బందోబస్తు నడుమ అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ రఘురాం, పెనగలూరు ఎస్ఐ సుబ్బారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లె : మండలంలోని ముక్కవారిపల్లి అరుంధతివాడ గ్రామంలో ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా బుధవారం రూ.25 లక్షల వ్యయంతో మాతమ్మగుడి సింహద్వారం ప్రతిష్టా కార్యక్రమంలో ముక్కా రూపానందరెడ్డి, సతీమణి వరలక్ష్మీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముక్కావారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పునరావాస కల్పనకు వేగంగా చర్యలు



లేఅవుట్‌లో పనులు జరుగుతున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ మూడు గ్రామాలకు పునరావాసం కల్పించేందుకు అధికారులు వేగవంతంగా పనులను నిర్వహిస్తున్నారు. బుధవారం పనులను హౌసింగ్ డీఈ కుప్పస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాల మేరకు పునరావాస పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 876 కుటుంబాలకు పునరావాసం కల్పిస్తున్నామన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



పూజలు చేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి దంపతులు

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి తంబెల వేణుగోపాల్‌రెడ్డి రూ.20 లక్షల సొంత నిధులతో రామాలయాన్ని నిర్మించనున్నారు. ఆలయ నిర్మాణానికి బుధవారం వేణుగోపాల్‌రెడ్డి, మారుతీకుమారి దంపతులు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలన్నారు. వచ్చే ఏడాది శ్రీరామనవమిలోపు ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, మురళీ ఆచారి, రాజేష్, కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సకల జనుల సంక్షేమానికే ‘నవరత్నాలు’

- అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేరాఫ్ ఆంధ్రప్రదేశ్
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



లబ్ధిదారులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న మహిళ

రామాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో సకల జనుల సంక్షేమం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామంలో ఉదయం 6 గంటలకే స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్ణపువాండ్లపల్లె, జగనన్నకాలనీ, రామాపురం, బి.రాచపల్లె, హరిజనవాడలలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. ఇతర రాష్ట్రాలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు.

గడప గడపలో నవరత్న వికాసం

ఏ గడపకు వెళ్లినా నవరత్న వెలుగులు ప్రసరిస్తున్నాయి. లబ్ధిదారులలో పథకాల సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ప్రజలు ఆయన ఎదుట హర్షం వ్యక్తం చేశారు. వీధులలో పర్యటిస్తున్నప్పుడు మీకు ఏ ఏయే పథకాలు అందుతున్నాయి, జగనన్న ఇస్తున్న పథకాలు బాగున్నాయా అని అడుగ్గా సీఎం జగనన్న అందిస్తున్న పథకాలన్నీ చాలా బాగున్నాయని, అర్హత ఉంటే పథకాలే ఏ ఒక్కరి సిఫార్సు లేకుండానే తమ ఇళ్లకే నేరుగా అందుతున్నాయని, ఈ విధంగా పథకాలు అందిస్తుండడం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదని, మళ్లీ మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆయన ఎదుట ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

సమస్యల పరిష్కారానికి ప్రజలతో ఆయన మమేకమయ్యారు. ప్రజల సమస్యలను ఓప్పిగా విని వాటి పరిష్కారానికి మార్గం చూపారు. కర్ణపువాండ్లపల్లెలో సీకే రోడ్డు నుంచి గోపగుడిపల్లె వరకు నిర్మాణ పనులు పూర్తయిన తారు రోడ్డును ఆయన ప్రారంభించారు. పలు పాఠశాలల విద్యార్థులతో మమేకమయ్యారు. డ్రైనేజీ కాలువల నిర్మాణాల పనులను పరిశీలించారు. తాగునీటి పథకం కావాలని స్థానికులు కోరగా స్పందించి త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు.

దళితోద్ధారకుడు సీఎం జగన్..

దళితుల సంక్షేమం, అభివృద్ధి జగనన్న చిత్తశుద్ధితో కృషి చేస్తూ దళితుల పక్షపాతిగా పేరొందారని హరిజవాడ వాసులు ఎమ్మెల్యే ఎదుట హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు దళితుల్లో ఎవరు పుట్టాలని కోరుకుంటారని మాట్లాడి దళితులను అవమానించారని, ఇటీవల నారా లోకేష్ దళితులు పీకింది ఏమీ లేదని వ్యాఖ్యానించడాన్ని వారికి గుర్తు చేశారు. తామెప్పుడూ జగన్ వెంటే నడుస్తామని హరిజనవాడవాసులు ఆయనకు స్పష్టం చేశారు.

అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతి రూపం రక్షాబంధన్

అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతి రూపం రక్షాబంధన్. రాఖీ పండుగ సందర్భంగా మండలంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి మహిళలు కలిసినుదుటన బొట్టుపెట్టి, రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. జగనన్నే ఈ రాష్ట్రానికి రక్ష అని మహిళలు తెలిపారు. మహిళల సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దిశ చట్టం మహిళలకు రక్షణ కవచంగా ఉందన్నారు. మహిళలకు అన్ని రంగాలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత జగన్ ప్రభుత్వందేనన్నారు. రాఖీ పండుగ ప్రజల జీవితాలలో సుఖశాంతులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, మహిళలకు శ్రీకాంత్‌రెడ్డి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, స్థానిక నాయకులు చెన్నారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భక్తవత్సల రెడ్డి, సత్యయాదవ్, పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో ద్వార ప్రతిష్ట పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని గుహేశ్వరి పశుపతినాథ ఆలయానికి శాస్త్రోక్తంగా జరిగిన రాతి బంధనాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా పశుపతినాథ ఆలయానికి 4, గణపతి 1, పార్వతీదేవికి 1, సుబ్రమణ్యం ఆలయానికి 1 సంబంధించి నిర్మాణంలో భాగంగా ఏడు రాతి ద్వార బంధనాలు వేదపండితులచే బుధవారం శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, వివి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆటో ఢీ : యువకుడికి గాయాలు

రామసముద్రం : ఆటో ఢీకొని యువకునికి తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలు మండలంలోని దిగువబొంపల్లి గ్రామానికి చెందిన వెంకటప్పకు మారుడు గంగాధర్ (25) ద్విచక్రవాహనంలో సొంత పని నిమిత్తం ఆర్.నడింపల్లెకు వెళ్తుండగా ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదంలో గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108లో రామసముద్రం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకి తరలించారు.

పీఏసీఎస్ బ్యాంకులో బంగారు రుణాలు



రుణ సేవలను ప్రారంభిస్తున్న డీసీసీ బ్యాంకు చైర్మన్, అధికారులు

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో గల చెర్లోపల్లి పీఏసీఎస్ బ్యాంకులో బుధవారం నూతనంగా బంగారంపై రుణాలు అందించే సేవలను రాష్ట్ర డీసీసీ బ్యాంకు చైర్మన్ మల్లెల ఝాన్సీరాణీ, డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చెర్లోపల్లి పీఏసీఎస్ బ్యాంకులో బంగారు తూకానికి సంబంధించి వెయిట్ మిషన్లను పరిశీలించి, లబ్ధిదారులకు బంగారు రుణాన్ని అందించారు. అనంతరం చెర్లోపల్లి పీఏసీఎస్ బ్యాంకు వారు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, డీసీసీ బ్యాంకు అడ్వైజర్ సహదేవరెడ్డి, డీసీసీ బ్యాంకు ఏజీఎం వీరశేఖర్, వేణుగోపాల్‌రాజు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్యకు సన్మానం



సిద్దవటం యానాదయ్యను సన్మానిస్తున్న వివిధ సంఘాల నేతలు,

రాజంపేట రూరల్ : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దవటం యానాదయ్యను ఘనంగా సన్మానించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్ పాత బస్టాండ్‌లో వాల్మీకి సంఘం, నాయీ బ్రాహ్మణ, బీసీ, ముస్లిం మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లబోతుల ఈశ్వరయ్య అధ్యక్షతన బుధవారం టీటీడీ బోర్డు మెంబరుగా ప్రమాణ స్వీకారం చేసి వస్తున్న సందర్భంగా యానాదయ్యకు ఘన స్వాగతం పలికారు. రాజంపేటకు విచ్చేసిన ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి గజమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు యానాదయ్యను సన్మానించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నియోజవర్గ అధ్యక్షుడు రామకృష్ణయ్య, ఆర్‌డీసీ స్టేట్ డైరెక్టర్ గడికోట గుల్జార్‌బాషా, సంఘం ప్రతినిధులు టి.సుబ్రమణ్యం, మనుబోలు వెంకటసుబ్బయ్య, టి.రెడ్డెయ్య, రాంనగర్ ధర్మయ్య, రాంనగర్ ఆదినారాయణ, ఎస్.నాగరాజ, చికెన్ రమణ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమగ్ర విచారణ చేయండి

బీఎల్‌ఓలకు ఆర్డీఓ రామకృష్ణారెడ్డి సూచన



మాట్లాడుతున్న రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

సిద్దవటం : బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాలో సవరణలు, నమోదును పక్కాగా చేపట్టాలని రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం బూత్ లెవల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఓటు నమోదు, మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి ఓట్లను తొలగింపు తదితర అంశాలపై సమగ్రంగా విచారణ చేయాలన్నారు. ఓటర్ల పరిశీలనలో ఏవైనా లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్డీఓ తెలియజేశారు. తహసీల్దారు లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌క్రిష్ణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బహిరంగసభను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : సీపీఐ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6వ తేదీన రాయచోటిలో జరుగనున్న బస్సుయాత్ర, బహిరంగసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు విశ్వనాథనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద బస్సుయాత్ర వాల్‌పోస్టర్‌లను ఆయన ప్రజాసంఘాల నేతలతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుయాత్రలో భాగంగా సెప్టెంబరు 6న రాయచోటిలో బహిరంగ సభ ఉంటుందన్నారు. బహిరంగసభకు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో సాంబశివ, వి.రంగారెడ్డి, సుధీర్‌కుమార్, కోటేశ్వరరావు, జక్కల వెంకటేష్, రామాంజనేయులు, రెడ్డెయ్య, శంకర్‌నాయక్, యుగందర్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లి, బోనమల, చాకిబండ, వండాడి గ్రామాలలో మహిళా సంఘాల లీడర్లకు, లీడ్ ఫార్మర్లకు ఆయా గ్రామ పంచాయతీలలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా తరగతులు నిర్వహించినట్లు మండల పాయింట్ పర్సన్ సుబ్రమణ్యాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో రైతు అధిక పెట్టుబడులు, అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వినియోగించడం వల్ల వాతావరణ పరిస్థితులు అనుకూలించవన్నారు. రైతు తాను పెట్టిన పంట సరైన దిగుబడి లేక నష్టపోతున్నారని, దీనిని అధిగమించాలంటే ప్రకృతి వ్యవసాయం ఒకటే సరైన దారి అని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ ఫార్మర్లు, మహిళా సంఘాల సభ్యులు, ఏపీఎం రెడ్డమ్మ, సీసీలు, మండల టీం లీడర్ చందు, ఎస్ఎఫ్ఏ మానస, యానిమేటర్లు, ఐసీఆర్‌పీలు, ఐబీ ఐసీఆర్‌పీలు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తున్న 15 మంది అరెస్ట్

బి.కొత్తకోట: బి.కొత్తకోటలోని బుధవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 15 మందిని అరెస్ట్ చేశామని ఎస్ఐ రామమోహన్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న ప్రాంతాలపై దాడులు నిర్వహించామని తెలిపారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, తాగి బైక్‌లు నడిపినా కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్షేత్ర స్థాయిలో బీజేపీ బలోపేతానికి చర్యలు



మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

కలికిరి: క్షేత్ర స్థాయిలో బీజేపీ బలోపేతానికి చర్యలు తీసుకోనున్నట్లు ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా రాజంపేట పార్లమెంటు నియోజకవర్గంలోని అసెంబ్లీ సిగ్మెంట్‌ల వారిగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించామన్నారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేయడానికి మరింత కృషి చేయాల్సి ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన వ్యక్తులలో పీఎం మోదీ ముందంజలో ఉన్నారన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలోనూ బీజేపీ పూర్తి స్థాయిలో మెజారిటీ సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. జిల్లాలోని అడవిపల్లి ప్రాజెక్టు నీటికి చిత్తూరు తాగునీటి అవసరాలకు పైపులైన్‌లు ఏర్పాటు చేస్తున్నారని, అయితే అడవిపల్లి ప్రాజెక్టు జిల్లా రైతులకు సాగునీటి ఉపయోగపడాలన్నారు. నాలుగు రోజుల పర్యటనను ముగించుకున్న మాజీ సీఎం బుధవారం సాయంత్రం తిరుగుప్రయాణమయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు నరేంద్రకుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకు పోరాటం

కడప ఎడ్యుకేషన్ : సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ఇచ్చిన హామీ అమలయ్యే వరకు పోరాటం చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబులు అన్నారు. బుధవారం సాయంత్ర కడప యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్ విధివిధానాలు ఎమిటో డ్రాఫ్టు విడుదల చేయకుండా అందులో ఏముందో ఉద్యోగులకు చెప్పకుండా ఏకపక్షంగా అమలు చేయడాన్ని మేము నిరసిస్తున్నామన్నారు. 2004కు ముందు నియామకపు ప్రక్రియ పూర్తైన 11 వేల మందికి పాత పెన్షన్ విధానం అమలు చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో 3 లక్షల మంది సిపిఎస్ ఉద్యోగులు పాత పెన్షన్ విధానాన్ని కోరుతున్నారన్నారు. కావున ఉద్యోగుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన మాటకు కట్టుబడి పాత పెన్షన్ విధానాన్ని అమలు, సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకరావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ముఖ్యమంత్రి తన విశ్వసనీయతను నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తరగతి గదిల్లో మొబైల్ ఫోన్ వాడకూడదని ఇచ్చిన ఉత్తర్వులు స్వాగతిస్తున్నామని అయితే పాఠశాలల్లో ఉదయం నుంచి సాయంత్ర వరకు వేసే యాప్‌లన్నింటిని కూడా బహిష్కరించాలని తెలిపారు.

పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

– గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : అర్హతే ప్రమాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఓబనపల్లి–2 సచివాలయ పరిధిలోని ఆర్.వడ్డిపల్లె గ్రామంలో బుధవారం పర్యటించిన కొరముట్లకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సమాచారమిచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను ఓ భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలుగా భావించి, అందులోని హామీలను నెరవేర్చారన్నారు. ఇప్పటివరకు దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని పథకాలను అమలు చేశామన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం రూపంలో లక్షలాది రూపాయల లబ్ధి జరిగిందన్నారు. దీనితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవని తెలియజేశారు. దీంతో ప్రతిపక్షాలు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు.

చంద్రబాబును నమ్మితే రాష్ట్రం అంధకారం

చంద్రబాబును నమ్మితే రాష్ట్రం అంధకారం అవుతుందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గతంలో టీడీపీ హయాంలో పథకాలు ఏ విధంగా ఎవరికి అందేవో అందరికీ బాగా తెలుసన్నారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే లబ్ధి జరిగిందన్నారు. కానీ ఇప్పుడు అలా కాదన్నారు. అర్హులుంటే చాలని, ఏ పార్టీ వ్యక్తి అని చూడకుండా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ప్రజల్లోకో ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు అండ్ కో లేనిపోని విమర్శలతో తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మరోసారి సీఎం జగనన్న సంక్షేమ పాలనకే ఓటు వేసి, 2024లోనూ వైఎస్సార్‌సీపీకే అధికారం కట్టబెట్టాలని కోరారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో నాడు–నేడు కార్యక్రమంలోబాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, తోట శివసాయి, ప్రతాప్‌రెడ్డి, కనుపర్తి ఈశ్వరయ్య, ధనుంజయ, సుంకేసుల బాషా, సచివాలయ అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.